క్లుప్తంగా

అంగన్‌వాడీ విద్యార్థులకు అక్షరభ్యాసం



కృష్ణునిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాసం

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని సిబ్బంది నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. తల్లుల సమక్షంలో చిన్నారులకు అంగన్‌వాడీ సిబ్బంది విద్యాభ్యాసం జరిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొంతు ఆదిలక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అల్లాడ అరుణ, అంగన్‌వాడీ టీచర్లు ఎ.త్రిలక్ష్మి, పి.అప్పాయమ్మ, ఎస్.దీనారత్నం, సిహెచ్.విజయలక్ష్మి, ఎస్.కొండారత్నం, హెల్పర్స్ ఐ.అరవాలమ్మ, సిహెచ్ పద్మ, బి.శివగంగ, జె.శిరీష పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రసాద్

ఏలేశ్వరం: భూసార పరీక్షలతో పంటలకు ఎంతో మేలు జరుగుతుందని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎల్‌కే ప్రసాద్ అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించడంతో రైతన్నలకు మేలు జరుగుతుందన్నారు. వరిలో సన్నరకాలు వేయడం ద్వారా అధికధరతో పాటు మార్కెటింగ్ బాగుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చొన్నారు. పంటలకు భీమా చేయించడంతో ఎన్నో ఫలితాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త బినాగేశ్వరారెడ్డి, ఏఓ బిజ్యోతి, సర్పంచ్ పేతల నూకరాజు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



బలరామపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

రౌతులపూడి: మోటారు వాహన చట్టప్రకారం ఎవరైనా నిబంధనలను అతిక్రమించి వాహనాలు రవాణా సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన రౌతులపూడి శివారు బలరామపురం రోడ్డులో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక బరువు, భద్రత, నియమాలు పాటించకుండా రౌతులపూడి, శంఖవరం గ్రామాల మీదుగా రవాణా సాగిస్తున్న 14 క్వారీ లారీలను గుర్తించారు. సంబంధిత వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.2.40లక్షలు జరిమానా విధించామని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణా సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

తుని: రక్తదానం చేయడం వలన మానవ శరీరానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న అన్నారు. గురువారం ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో గణపతినగర్‌లోని వాకర్స్‌కు రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తదానం చేయడమంటే మరొకరి ప్రాణాలను కాపాడినవారు అవుతారన్నారు. పలువురు వాకర్స్ నుంచి రక్తం సేకరించి, బ్లడ్ గ్రూపులు నిర్ధారించారు. భవిష్యత్‌లో అవసరమైతే రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. సిటీ వాకర్స్, ఆయోధ్య రామా క్లబ్ అధ్యక్షులు లోకారెడ్డి అప్పారావు, వాసుదేవన్, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిన్నారావు, తటవర్తి రాజా, బోడిశెట్టి త్రిమూర్తి స్వామి, కుచ్చర్లపాటి భీమరాజు, పలువురు వాకర్లు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగు మందు సేవించి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సన్నపు నాగేంద్రుడు (54) కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. గురువారం ఇంటి వద్దే ఉన్న అతను పురుగు మందు సేవించి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే గోకవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని వారు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్‌గా మీటర్లు ఏర్పాటు

- శరవేగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు
- నేరుగా ఫోన్ నుంచే బిల్లుల చెల్లింపు
- ఉపాధి కోల్పోనున్న రీడర్లు



ప్రభుత్వ కార్యాలయానికి స్మార్ట్‌మీటర్‌ను అమర్చుతున్న సిబ్బంది

తుని రూరల్: ట్రాన్స్‌కో సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రైవేట్ సంస్థలకు చెందిన స్మార్ట్ మీటర్లు కావడంతో సదరు సంస్థ నియమించిన సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, సంస్థల, దుకాణాలకు, ఇళ్లకు ఇప్పటికే ఉన్న డిజిటల్ మీటర్లను తొలగించి దాని స్థానంలో స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారు. తుని సబ్ డివిజన్ పరిధిలో తుని పట్టణం, హంసవరం, కోటనందూరు, తొండంగి, అన్నవరం సెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 80 వేలకు పైగా గృహ, గృహేతర విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. గడిచిన ఆరు నెలలుగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కార్యాలయాలు, వివిధ సంస్థలు, వ్యాపార కేంద్రాలకు, దుకాణాలకు స్మార్ట్ మీటర్ల అమర్చారు. ఈవీ పది శాతం వరకు ఉంటాయని అంచనా. మిగిలిన 90శాతం గృహ అవసరాలకు వినియోగించే కేటగిరి-వన్ మీటర్ల కావడంతో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండ 300పైగా యూనిట్లు వాడే ఇళ్లకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. క్రమంగా వందశాతం డిజిటల్ మీటర్లను తొలగించి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే పనులు జోరుగా సాగుతున్నాయి.

ఉపాధి కోల్పోనున్న సిబ్బంది

స్మార్ట్ మీటర్లను అత్యాధునిక సాంకేతికతో రూపొందించినట్టు తెలుస్తుంది. ఇప్పటి వరకు ఉన్న డిజిటల్ మీటర్లలో ఎంతమేరకు విద్యుత్ వినియోగించారో ప్రతి నెల ఇళ్లకు, దుకాణాలకు, ఆయా సంస్థలకు సిబ్బంది వెళ్లే రీడింగ్ నమోదు చేసి బిల్లులు ఇచ్చేవారు. స్మార్ట్‌మీటర్లతో ప్రతి నెల ఇంటింటికి వెళ్లి రీడింగ్ నమోదు చేసే అవసరం లేదు. ఏర్పాటు సమయంలో నిర్దేశించిన తేదీకి నేరుగా వినియోగదారుల ఫోన్‌కు ఎస్ఎంఎస్ (కరెంటు బిల్లు) రూపంలో చేరుతుంది. దాని ఆధారంగా వినియోగదారులు బిల్లులు చెల్లించాలి. కొన్నాళ్ల తర్వాత ఈ స్మార్ట్‌మీటర్లనే ప్రీపేడ్ మీటర్లకు కొనసాగించనున్నట్టు ట్రాన్స్‌కో అధికారులు పేర్కొన్నారు. దీంతో విద్యుత్ రీడింగ్ నమోదు చేసే సిబ్బంది అవసరం ఉండదు. ఫలితంగా వీరంత ఉపాధి కోల్పోనున్నారు. న్యాయం చేయాలని కోరుతూ ఇప్పటికే పలుధపాలు రీడింగ్ నమోదు సిబ్బంది ప్రభుత్వానికి తమ మెర వినిపించారు.

అపోహలొద్దు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో అధిక బిల్లులు వస్తాయన్న అపోహలొద్దు. వాడిన విద్యుత్‌కే బిల్లు మీ ఫోన్‌కే ప్రతినెల వస్తుంది. ప్రీపేడ్ విధానం అమలు చేసిన తర్వాత నుంచి మీ అవసరాలకు అనుగుణంగా రీచార్జ్ చేసుకుని విద్యుత్‌ను వాడుకోవచ్చు. వినియోగదారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

–సీహెచ్.వెంకటరమణ, ట్రాన్స్‌కో ఏఈ,



జగన్నాథగిరిలో వీధిలైట్లకు అమర్చిన స్మార్ట్‌మీటర్



జగన్నాథగిరిలో దుకాణానికి..



జగన్నాథగిరిలో ఓ గృహానికి..

తల్లులను నమ్మించి నయవంచన



ముదునూరి కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: ఎన్నికల్లో నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తల్లులను నిలువునా నమ్మించి నయవంచన చేసిందని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముదునూరి కృష్ణంరాజు విమర్శించారు. మండలంలోని ధర్మవరంలో ఆయన స్వగృహంలో గురువారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నయవంచన చేశారన్నారు. రూ.15 వేలు చొప్పున ఇస్తానని నమ్మించి.. ఇప్పుడు రూ.2 వేల చొప్పున కోత వేయడం దారుణమన్నారు.

తొలి నుంచి మహిళలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనని విమర్శించారు. ప్రజల్ని మోసం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను బురిడీ కొట్టించారని మండిపడ్డారు. తొలి ఏడాది తల్లికి వందనం పథకం అమలు చేయకపోగా, రెండో ఏడాది 29 లక్షల మందికి ఇవ్వకుండా మోసం చేశారని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఏడాది కాలం కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా, అరాచకంగా పరిపాలన చేసిందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు



జేవీఆర్ సెంటర్‌లో వాహనాల వేగ నియంత్రణకు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

జగ్గంపేట: జగ్గంపేట పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. ఈ మేరకు జగ్గంపేటలో గురువారం జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చేపట్టిన పనులను గురువారం సిబ్బందితో స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా జగ్గంపేటలోని జేవీఆర్ సెంటర్ వద్ద జాతీయ రహదారి దాటడం పెను సవాల్‌గా మారిందన్నారు. ఇక్కడ నాలుగు రోడ్లు కూడలి కావడం, జాతీయ రహదారి బ్రిడ్జిపై నుంచి వాహనాలు వేగంగా రావడంతో జేవీఆర్ సెంటర్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు విశాఖపట్నం, రాజమండ్రి వైపు వెళ్లే మార్గాల్లో స్టాపర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రేడియం స్టిక్కర్లు అంటించిన టైర్లను జిగ్‌జాగ్‌గా రహదారిపై రెండు వైపుల ఏర్పాటు చేశామన్నారు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయంలో ట్రాఫిక్ నియంత్రించేందుకు సిబ్బందిని నియమిస్తున్నామని, వాహనదారులు రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా వుండాలని సూచించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై రఘునాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ



ఎస్.పైడిపాలలో ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు చినదివాణం

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాల సర్వే నంబర్ 15లో 3.386 హెక్టార్లులో నల్లరాయి క్వారీ నిర్వహణ కోసం గారపాటి రామకృష్ణ పెట్టుకొన్న దరఖాస్తులపై అధికారులు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆర్‌ఓ.ఎంబీఎస్ శంఖరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి పర్యవేక్షణలో జరిగింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎన్జీవోలు, స్థానికుల నుంచి ప్రజాభిప్రాయాలను సేకరించారు. పర్యావరణానికి ఎలాంటి హాని కల్గకుండా, ఇళ్ల దెబ్బతినకుండా నైపుణ్యత, నిర్దేశిత ప్రమాణాలతో బ్లాస్టింగ్ చేపట్టాలని, స్థానికులకు ఉపాధి, మౌళిక సదుపాయాలు కల్పించాలని ప్రజా ప్రతినిధులు, ఎన్జీవోలు, సమీప ప్రజలు కోరారు. దీంతో పర్యావరణానికి ఏవిధమైన హాని కలగకుండా, ఉపాధి, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని యాజమాన్యాలు హామీ ఇచ్చారు. సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, స్థానిక నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, గొల్లు వెంకటరమణ, తహసీల్దారు. ఎస్‌వీ నరేష్, ఎస్సై బి.వెంకటేశ్వరరావు, ఎన్విరానిమెంట్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సందేశాత్మక నాటకం



దర్శక, రచయిత వెంకటేశ్వరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ఏలేశ్వరం: తండ్రి కూతుళ్ల అనుబంధాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపించిన ఇగో నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి ఇగో నాటకాన్ని ప్రదర్శించారు. తిరుమాలి గ్రామానికి చెందిన నటుడు కట్టా వెంకటేశ్వరరావు రచించి, దర్శకత్వం వహించారు. గ్రామానికి చెందిన కళాకారులు ఓలేటి చంటిబాబు, మాగాపు శ్రీనివాస్, కట్టా శ్రీనివాస్, కట్టా పండు, సుజాత నటించారు.

తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లిపోయి ప్రేమ వివాహాలు చేసుకుంటున్న యువతను ఆలోచింపచేసే విధంగా నాటకం కొనసాగింది. పెంచి పెద్దచేసిన పిల్లలు తమను లెక్కచేయకుండా ప్రేమవివాహాలు చేసుకుంటే తండ్రి పడే ఆవేదన ప్రేక్షకులను కట్టిపడేసింది. తల్లిదండ్రులను మెప్పించి వారి ఇష్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని నాటకంలో సందేశం ఇచ్చారు. అనంతరం దర్శక, రచయిత కట్టా వెంకటేశ్వరరావును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

పనిప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



ఒంటిమామిడిలో కూలీల సమస్యలు తెలుసుకుంటున్న ఎఫ్ఎన్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివకోటి రాజు

తొండంగి: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎఫ్ఎన్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివకోటి రాజు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఒంటిమామిడిలో ఉపాధిహామీ పనులు జరుగుతుండగా పనిచేస్తున్న కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు నెలలుగా కూలీలకు చెల్లించాల్సిన కూలీ సొమ్ములు చెల్లింపు జరగలేదని వాపోయారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శివకోటి రాజు విలేకరులతో మాట్లాడుతూ కూలీలకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలన్నారు. పనిచేస్తున్న ప్రదేశాల్లో మజ్జిగ, తాగునీరు, మెడికల్ కిట్లు, టెంట్లు వంటి సౌకర్యాలు నిబంధనలు ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఉపాధిహామీ కూలీల తరపున జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

తుని: చిన్నారులకు సులభతరమైన విధానంలో విద్యను భోదించాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత అంగన్వాడీలకు సూచించారు. గురువారం కొండవారిపేట సెక్టార్లో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడేళ్ల లోపు పిల్లలను స్థానిక అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని సీడీపీవో శ్రీలత కోరారు. అంగన్వాడీ పిలుస్తోంది ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ సరస్వతి, అంగన్వాడీలు ధనలక్ష్మి, సాయమ్మ, లలిత, మహాలక్ష్మి, పద్మ, పాల్గొన్నారు.

విద్యార్థుల బడి బాట



పెద్దిపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరచుకోవడంతో విద్యార్థులు గురువారం బడి బాట పట్టారు. తొలి రోజు మండలంలోని 50 ప్రభుత్వ పాఠశాలల్లో 30 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్న భోజనం కూడా మొదటి రోజున అమలు చేశారు. చింతలూరు, శరభవరం, గజ్జనపూడి పాఠశాలలను ఎంఈఓ వి.రాజబాబు, సీఆర్పీ రాంజీ ప్రసాద్, పెద్దిపాలెం, ఉత్తరకంచి, గోకవరం పాఠశాలలను ఎంఈఓ–2 వై.అచ్చిరాజు, సీఆర్పీ బాషా బృందాలు పరిశీలించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెద్దిపాలెం పాఠశాలలో కొత్తగా 9, 10 తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కొండపల్లి ఉలుగోగుల, కె.అచ్చింపేటల్లో గిరిజన ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించామన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ ప్రారంభం



ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభించి, మహిళలకు తాగునీరు అందిస్తున్న ఎమ్మెల్యే

జగ్గంపేట: జల్ జీవన్ మిషన్ నిధులతో జగ్గంపేట సంత మార్కెట్ ప్రాంతంలో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం ప్రారంభించారు. మంచినీటి కుళాయిల వద్ద తాగునీరు పట్టి మహిళలకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జల్‌జీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రామవరంలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా రామవరం మీదుగా జగ్గంపేట వరకూ కార్ల ర్యాలీ నిర్వహించారు.

సీసీ రోడ్లు ప్రారంభం

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో గురువారం ఎన్ఆర్జీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్, తాళ్లూరు నుంచి ఉప్పలపాడు వరకు ఎన్ఆర్జీఎస్ నిధులు రూ.90 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, సీసీ రోడ్డులను గురువారం ఆయన ప్రారంభించారు.

హెల్మెట్ ధరించాలి



హెల్మెట్ ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సై

గండేపల్లి: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. జాతీయ రహదారిపై గండేపల్లిలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుకోని ప్రమాదాలు జరిగితే హెల్మెట్ ధరించడం వలన ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎస్సై యూవీ శివ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఘనంగా చండీహోమం



చండీహోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి జన్మనక్షత్రం మూల సందర్భంగా గురువారం చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఐదుగురు భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి



బవురువాకలో ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో పర్యటించి, ప్రజల సమస్యలు గుర్తించి, పరిష్కారానికి పాటుపడతానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. బవురువాక గిరిజన గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసి ప్రజలను మోసం చేసిందని అన్నారు. నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూరిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్పించవద్దు

గోకవరం: పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో గుర్తింపు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని ఎంఈఓ బి.గౌరమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గోకవరం మండలంలో లెనోరా ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు ఎటువంటి గుర్తింపు లేదని, పిల్లలను ఆ పాఠశాలలో చేర్పించవద్దని ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సూచించారు. కావున విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూళ్లలో మాత్రమే చేర్పించాలన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

గోకవరం: మండల కేంద్రం గోకవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ జెపిబి నటరాజన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గ్రామంలో టీచర్స్ కాలనీ, మెయిన్‌రోడ్డు, మురళీనగర్, దాసరి వారి వీధి, పద్మాప్రియా శ్రీనివాసా థియేటర్ ప్రాంతం, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. కావున వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జగ్గంపేట: కాకినాడ రోడ్డులోని విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్టు కొమ్ముల తొలగింపు, విద్యుత్ లైన్లు మరమ్మతులను శుక్రువారం చేపడుతున్నట్లు విద్యుత్ డిఇ వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీనితో కాకినాడ రోడ్డు పద్మనాభనగర్, శెట్టిబలిజీపేట, పల్లపువీధి, సత్యవేణి నగర్, జగ్గంపేట మెయిన్ రోడ్డు తదితదర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు అంతరాయనికి సహకరించాలని కోరారు.

ప్రత్తిపాడు: వివిధ కారణాల రీత్యా స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. విద్యుత్ లైన్లలోని చెట్ల కొమ్మలు, తుప్పలు తొలగించడం, సబ్ స్టేషన్‌లో సాంకేతిక మరమ్మతులు తదితర కారణాలతో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. దీని వల్ల ప్రత్తిపాడు, టి.రాయవరం, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాల్సిందిగా ఈఈ బి.వీరభద్రరావు కోరారు.

విమాన ప్రమాదం దురదృష్టకరం

ప్రత్తిపాడు: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో విమానం కూలిపోవడం పట్ల మండలంలోని పలువురు రాజకీయ ప్రముఖులు గురువారం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియా విమానం బీజీ మెడికల్ కళాశాల హాస్టల్‌పై కూలిపోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మాటల్లో చెప్పలేని హృదయ విదారకర ఘటన అని అన్నారు. బాధిత కుటుంబాలకు తమ సానుభూతిని వ్యక్తం చేశారు.